# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## తిరుమలలో నిరసనలపై ఆంక్షలు

**బలగం టీవీ,తిరుపతి**

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఆధ్యాత్మికతకు భంగం కలిగించొద్దని తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు కోరారు. త్వరలో తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో నిత్యం అశేషంగా భక్తులు, ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. తిరుపతి నగరంలో ఏదైనా సంఘటన జరిగితే వెంటనే సంచలనం అవుతుందని, కావున రాజకీయ పార్టీలు, మత సంఘాలు, ప్రజా సమూహాలు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.తిరుపతి నగర ప్రాశస్త్యాన్ని కాపాడే విధంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పోలీస్ శాఖకు సహకరించాలి. ఆధ్యాత్మికతకు భంగం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నగరంలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు చేయాలనుకున్నవారు ముందుగా పోలీస్ వారికి రోడ్ మ్యాప్ ను వివరించాలన్నారు. పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని ఉల్లంఘించి వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ఘర్షణలకు దారి

మిగితా 3వ పేజీలో





## సూపర్ కంప్యూటర్లను ఆవిష్కరించిన ప్రధాని

**భారీ దూరదృష్టి ఉన్నప్పుడే దేశం ఉన్నత విజయాలను లక్షం చేసుకోగలదు : ప్రధాని మోడీ**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారీ దూరదృష్టి ఉన్నప్పుడే దేశం ఉన్నత విజయాలను లక్షం చేసుకోగలదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని నరేంద్ర మోడీ గురువారంఆవిష్కరించారు. శాస్త్రీయ పరిశోధనల కోసం 130 కోట్ల రూపాయలతో పుణె, ఢిల్లీ, కోల్‌కతాలో ఏర్పాటు చేసిన "పరమ్ రుద్ర" సూపర్ కంప్యూటర్లను ఢిల్లీ నుంచి ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. వాతావరణ పరిశోధనల కోసం 850 కోట్ల రూపాయలతో రూపొందించిన హై-పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను ప్రధాని ఆవిష్కరించారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో ఇదో గొప్ప విజయమని ఈ సందర్భంగా మోడీ పేర్కొన్నారు. సాంకేతిక, కంప్యూటింగ్ సామర్థ్యంపై ఆధారపడని రంగమంటూ ఏదీ లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మెరుగుదల పేదలను సాధికారులను చేసేదిగా ఉండాలని ప్రధాని స్పష్టం చేశారు. ఇది ఐటి, తయారీ, ఎంఎస్ఎంఇలు, స్టార్టప్‌ల మెరుగుదలకు దోహదం చేస్తుంది' అని ఆయన చెప్పారు. తన ప్రభుత్వం సైన్స్, టెక్నాలజీ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నదని మోడీ తెలియజేశారు.

ఈ సాంకేతిక విప్లవంలో భారత్ వాటా బిట్స్, బైట్స్‌లో కాకుండా టెరా బైట్లు, పెటా బైట్లలో ఉండాలన్నారు. భారత్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు. సొంతంగా సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను నిర్మించి ప్రపంచంలోని సరఫరా గొలుసులో కీలకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ప్రాముఖ్యం కేవలం ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే పరిమితం కారాదన్న ప్రధాని, దేశంలో ఆఖరి పౌరుడి ఆకాంక్షలను సైతం నెరవేర్చేలా ఉండాలని ఆకాంక్షించారు.

"అంతరిక్ష రంగంలో భారత్ ప్రధాన శక్తిగా మారింది. ఇతర దేశాలు వేల కోట్ల రూపాయలు వెచ్చించి సాధించిన విజయాన్ని మన శాస్త్రవేత్తలు పరిమిత వనరులతోనే సాధించారు. చంద్రుని దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న తొలి దేశంగా భారత్ అవతరించింది. ఇదే ఉత్సాహంతో భారత్ ఇప్పుడు గగన్‌యాన్ కోసం సిద్ధమవుతోంది. 2035 కల్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవలే అందుకు సంబంధించిన మొదటి దశకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది" నరేంద్ర మోడీ తెలిపారు.

'ఈ విప్లవంలో మన వాటా తునకలు, బైట్లుగా కాకుండా టెరాబైట్స్, పెటాబైట్స్‌లో ఉండాలి. అందువల్ల మనం సరైన వేగంతో సరైన దిశలో సాగుతున్నట్లు ఈ విజయం రుజువు చేస్తున్నది' అని ఆయన పేర్కొన్నారు. 'సైన్స్ ప్రాముఖ్యత సృజనాత్మకత, అభివృద్ధిలోనే కాకుండా చివరి వ్యక్తి ఆకాంక్షలను పరిపూర్తి చేయడంలో కూడా ఉంది' అని మోడీ తెలిపారు. భారత్ సొంత సెమీ కండక్టర్ ఎకోసిస్టమ్ నిర్మిస్తున్నదని, అది గ్లోబల్ సప్లయి చైన్‌లో కీలక భాగం కాగలదని మోడీ తెలిపారు.

# మరో 30 రోజుల్లో

# డిజిటల్ హెల్త్ కార్డులు

## విద్య, ఆరోగ్యానికి రాష్ట ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- **హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేసి ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తాం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో పౌరులందరికీ మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్ కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పౌరులందరికీ హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేసి ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు.విద్య, ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. గురువారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని సీఎం రేవంత్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉందని అన్నారు. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని తెలిపారు. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్ ను డిజిటల్ చేయాల్సి ఉందన్నారు. ఈ హెల్త్ కార్డుల్లో గత చికిత్స వివరాలు కూడా పొందుపరుస్తారని తెలిపారు.

దుర్గాబాయి దేశ్ ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగం కావాలని సీఎ రేవంత్ కోరారు. కాగా, ప్రస్తుతం డిజిటల్ కార్డులు అమలులో ఉన్న హర్యానా, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో పనితీరుపై అధ్యయనం చేసేందుకు త్వరలో అధికారుల బృందం పర్యటించనుంది.

రాష్ట్రంలో ఇప్పుడున్నది సంక్షేమాభివృద్ధిని అమలు చేసే ప్రజా ప్రభుత్వమని, ప్రాఫిట్ మేకింగ్ బిజినెస్ ఓరియెంటెడ్ ప్రభుత్వం కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుల ప్రక్రియలో సహకారానికి సంబంధించి సామాజిక బాధ్యత కలిగిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ లాంటి సంస్థలతో త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం మంత్రి కి సూచించారు.

క్యాన్సర్ మహమ్మారితో చాలా మంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, క్యాన్సర్ చికిత్స పేదలకు భారమవుతోందని, రాష్ట్రంలో క్యాన్సర్ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ, హాస్పిటల్ సేవల విస్తరణపై యాజమాన్యం తీసుకొచ్చిన ప్రతిపాదనలను

మిగితా 3వ పేజీలో

## ఉప ఎన్నికకు కాంగ్రెస్ సిద్ధం

- **ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్**
- **కడియం శ్రీహరి**




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్టేషన్‌ఘనపూర్‌కు ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. గురువారం జనగామలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని అన్నారు. ఏకంగా శాసనసభ పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని వ్యాఖ్యలు చేశారు. ఇప్పట్లో ఉప ఎన్నిక రావని... వచ్చినా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్‌లో ఎన్నికలు వస్తే... బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. కోర్టులపై, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందన్నారు.

వరంగల్ చరిత్రను కనుమరుగు చేసేందుకే ఉమ్మడి జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలు చేశారని.. ఇది అడిగినందుకే తనకు రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బంధి అయిందని విమర్శించారు. స్టేషన్ ఘనపూర్‌కు ఉప ఎన్నికలు రావని... ఒకవేళ వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధమన్నారు.

## ఫార్మాసిటీ రద్దు వెనుక వేల కోట్ల భూ కుంభకోణం

- **ఫార్మాసిటీ పేరుతో సీఎం అన్నదమ్ములకు లబ్ధి చేకూర్చే కుట్ర..**
- **ప్రభుత్వాన్ని నడుపుతున్నారా.. లేక సర్కస్ నడుపుతున్నారా..**
- **ఫార్మాసిటీ ఉన్నట్టా, లేనట్టా..**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎమ్మెల్యే కేటీఆర్**




వివరాలు 2వ పేజీలో

## డ్రగ్స్ కేసులో టాలీవుడ్ నటుడు అరెస్టు

**బలగం టీవి, హైదరాబాద్**



డ్రగ్స్ కేసులో కోర్టుకు హాజరు కాకపోవడంతో టాలీవుడ్ నటుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. టాలీవుడ్ నటుడు అభిషేక్ గతంలో డ్రగ్స్ విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకోవడంతో ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లలో గతంలో కేసులు నమోదు చేశారు. కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న అభిషేక్ కోసం హైదరాబాద్ యాంటీ నార్కోటిక్ బ్యూరో పోలీసులు గతకొంత కాలం నుంచి వెతుకుతున్నారు. కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు అరెస్టు వారెంట్‌ను జారీ చేసింది. ఈ క్రమంలోనే అభిషేక్ గోవాలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు రెస్టారెంట్ నిర్వహిస్తున్న అభిషేక్‌ను అరెస్టు చేసి నగరానికి తీసుకుని వచ్చారు. అక్కడి కోర్టులో హాజరుపర్చి ట్రాన్సిట్ వారెంట్‌పై నగరానికి తీసుకుని వచ్చారు. అభిషేక్‌ను హైదరాబాద్ లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్-లో పోలీసులు విచారణ చేస్తున్నారు. అభిషేక్ టాలీవుడ్‌లో డేంజర్,ఐతే , నువ్వొస్తానంటే నేనొద్దంటానా, నేను , కాళిదాస్ వంటి సినిమాల్లో సాహాయ నటుడిగా నటించాడు.

## మూసీ ప్రక్షాళన షురూ



- **మూసీ రివర్ బెడ్‌లో సర్వే ప్రారంభం**
- **పలు చోట్ల అడ్డుకున్న స్థానికులు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన షురూ అయ్యింది. దాంతో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు సర్వే చేస్తున్నారు. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 25 ప్రత్యేక సర్వే బృందాలు పర్యాటిస్తున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో నాలుగు, మేడ్చల్‌లో 5 బృందాలు సర్వే చేస్తున్నాయి. నదీ గర్భంలోని నిర్వాసితుల నిర్మాణాల వివరాలను రెవెన్యూ అధికారులు అడిగి తెలుసుకుంటున్నారు. మూసీ నదిలో ఉన్న బఫర్ జోన్‌లోని నిర్మాణాలకు మార్కింగ్ చేస్తున్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వెళ్లడానికి నివాసితులను ఒప్పించారు. కొన్నిచోట్ల అధికారులకు తమ డిమాండ్లను నివాసితులు తెలియచేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాతే, మార్కింగ్ చేసిన ఇళ్లను తొలగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. కొన్నిచోట్ల అధికారుల సర్వేలను అడ్డుకునేందుకు బాధితులు యత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.తమ ఇళ్లను తొలిగిస్తే ఊరుకోబోమని, ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూం ఇళ్లు వద్దని ఆందోళనకు దిగారు.

నిర్మాణాలు అధికంగా ఉన్న బహదూర్‌పురాలో అయిదు బృందాలు, హిమాయత్ నగర్, నాంపల్లిలో మూడు టీములు పనిచేశాయి. అధికార బృందాలు ఇంటింటికి వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. డాక్యూమెంట్లను పరిశీలించి సర్వే పత్రంలో నమోదు చేసుకున్నారు. చాదర్ ఘాట్, మూసానగర్, శంకర్ నగర్‌లలో హిమయత్ నగర్ తహశీల్దార్ సంధ్యారాణి, గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీం బాగ్, ఆశ్రమ్ నగర్ ఎమ్మార్వో అహల్య, బహదూర్‌పురా కిషన్ బాగ్ పార్క్ సమీపంలో తాహసిల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. మొదటి రోజు చాలా వరకు ఇండ్లకు మార్కింగ్ చేసిన రెవెన్యూ

మిగితా 3వ పేజీలో

## ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్ మెంట్ కాలేజీలు




- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రానున్న రోజుల్లో ప్రతీ జిల్లాలో స్కిల్ డెవలప్ మెంట్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. యూసఫ్ గూడ నిమ్స్ మే లో నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ స్వల్ప కాలిక శిక్షణ పథకం కింద స్వచ్ఛత హి సేవా ఈవెంట్ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు నైపుణ్య విద్యనందించడానికి ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ యువకులకు స్కిల్ పెంపొందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. ఈ ధ్యేయంతో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ లో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీ స్థాపించిందన్నారు.ఇందులో 17 రకాల సర్టిఫికెట్, డిప్లొమో, డిగ్రీ కోర్సులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతీ జిల్లాలో స్కిల్ డెవలప్ మెంట్ కాలేజీ ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీలలో యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుందని తెలిపారు.



## ఆర్టిజెన్స్ భారీ ధర్నా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మింట్ కాంపౌండ్ వద్ద ఆర్టిజెన్స్ భారీ ధర్నా నిర్వహించారు.ఆర్టిజన్‌లను రెగ్యులర్ చేసిన తరువాతనే జేఎల్ఎం, సబ్ ఆర్డినేట్స్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం దగ్గర 2000 మంది ఆర్టిజెన్స్ ధర్నా చేపట్టారు. విద్య అర్హతను బట్టి ప్రమోషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టిజెన్స్‌ను రెగ్యులర్‌గా చేయాలని, అర్హులకు ప్రమోషన్‌లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో రెండు వేల మందికిపైగా ఆర్టిజన్లు పాల్గొనడంతో సెక్రటేరియట్ వైపు నుంచి మింట్ కాంపౌండ్ కు వెళ్లే రోడ్డును పోలీసులు మూసేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. దశాబ్దాల తరబడి సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్లకు ప్రమోషన్లు ఇవ్వకుండా ఉద్యోగాల భర్తీకి ప్రయత్నించడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఏకపక్షంగా ముందుకెళ్తున్న హైడ్రా

- **సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో హైడ్రా కూల్చివేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడికి బహిరంగ లేఖ రాశారు. హైడ్రా పేరుతో ఏకపక్షంగా ముందుకెళ్తున్నారని, నగరంలో నిర్మాణాలకు ప్రభుత్వాలే అనుమతులు ఇచ్చి, ఇప్పుడు అక్రమం అంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఇలా ఏకపక్షంగా ప్రజల ఇళ్లను కూలగొడితే, పేద, మధ్యతరగతి ప్రజలు ఏమైపోవాలని కిషన్ రెడ్డి నిలదీశారు. ప్రభుత్వాలు నిర్మాణాలు చేపట్టి పేరు తెచ్చుకోవాలి. కాని మీరు, మీ ప్రభుత్వం కూల్చివేత తో పేరు తెచ్చుకోవాలనుకుంటున్నారు. అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ఇచ్చిన అనుమతులు తప్పు అని హైడ్రా ఎలా చెబుతోందన్నారు. గత ప్రభుత్వాలు పేదల కోసం అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేశాయని గుర్తు చేశారు. హైడ్రా అధికారులు, ప్రభుత్వం కూల్చివేతలకు ముందు బాధితులతో చర్చించాలని, ప్రభుత్వానికి సామాజిక బాధ్యత ఉండాలని కిషన్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

# ఫార్మాసిటీ రద్దు వెనుక వేల కోట్ల భూ కుంభకోణం

- ఫార్మాసిటీ పేరుతో సీఎం అన్నదమ్ములకు లబ్ధి చేకూర్చే కుట్ర..
- ప్రభుత్వాన్ని నడుపుతున్నారా.. లేక సర్కస్ నడుపుతున్నారా..
- ఫార్మాసిటీ ఉన్నట్టా, లేనట్టా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎమ్మెల్యే కేటీఆర్




**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

"మా ప్రభుత్వ హయాంలో సిరిసిల్లను మరో తిరుపూర్ చేయాలని మేము ప్రయత్నించాం.పదేళ్లుగా లేని ఆత్మహత్యలు మళ్లీ జరుగుతుంటే, సీఎం రేవంత్ రెడ్డి మనసు చలించటం లేదా.ఏ కారణం చేత సిరిసిల్లను, నేతన్నలను గోస పుచ్చుకుంటున్నావు, నా మీద కోపం, మా పార్టీ మీద కోపం, నన్ను ప్రజలు గెలిపించారని కోపం తో, కాంగ్రెస్ ను గెలిపిస్తలేరన్న కోపంతో బతుకమ్మ చీరల ఆర్డర్లను నిలిపివేస్తారా" అని బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.ఫార్మాసిటీ ఉన్నట్టా,లేనట్టా స్పష్టం చేయండి అని, కోర్టులో మాత్రం ఫార్మాసిటీ కొనసాగుతుందంటూ న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు అని, ఫార్మాసిటీని రద్దు చేస్తే రైతుల భూమి వారికి అప్పగించాలి అని అన్నారు.ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సహా మంత్రులు చాలా సందర్భాల్లో ప్రకటించారు,అదే నిజమైతే రైతుల నుంచి సేకరించిన భూమిని వారికి తిరిగి ఇచ్చేయాలఅని అన్నారు. ఇదే ప్రభుత్వం ఒకవైపు ఫార్మాసిటీ రద్దు చేశామంటూనే,హైకోర్టులో మాత్రం ఫార్మాసిటీ రద్దు కాలేదని చెబుతోంది అని అన్నారు.

ఫ్యూచర్ సిటీ, ఏఐ సీటీ, ఫోర్త్ సిటీ అంటున్నారు, దాని కోసం ఒక్క ఎకరం భూమినైనా సేకరించిరా, ఒక్క ఎకరాం సేకరించకుండా ఫార్మా సిటీ భూములను ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తారు అని అన్నారు.ఏ విధంగా హైకోర్టును, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తారు అని,ఫార్మా సిటీ వెనకు వేల కోట్ల భూ కుంభకోణం ఉంది, అన్ని వివరాలను త్వరలోనే బయటపెడతామని అన్నారు.

నీ అన్నదమ్ములకు వేల కోట్ల రూపాయల లబ్ధి చేసే కుట్ర చేస్తున్నావు అని,ఫార్మా సిటీ ఉన్నట్టా, లేనట్టా ఈ ప్రభుత్వం హైకోర్టులో స్పష్టం చేయాలి అని అన్నారు.14 వేల ఎకరాలల్లో, 64 వేల కోట్ల పెట్టుబడులతో మేము ఫార్మాసిటీ ని ప్రతిపాదించాం,అందుకోసం కండిషనల్ ల్యాండ్ అక్విజేషన్ ను చేశాం. ఆ భూములను ఇతర అవసరాలకు మళ్లించే అవకాశం లేదు అని అన్నారు.అలా భూములను ఇతర అవసరాల కోసం మళ్లించి వేల కోట్ల స్కాం చేయాలని ప్రయత్నిస్తున్నారు.ఫార్మాసిటీ ఉంటే 14 వేల ఎకరాలు ఉండాలే, లేదంటే రైతులకు భూములు తిరిగి ఇచ్చేయాలి అని అన్నారు.

ఈ ప్రభుత్వం లో కుడి చేయి ఏం చేస్తుందో ఎడమ చేతికి తెలుస్తలేదు,వీళ్ల ప్రభుత్వాన్ని నడుపుతున్నారో,సర్కస్ నడుపుతున్నారో తెలుస్తలేదు అని అన్నారు.ఒక శాఖ పర్మిషన్ ఇస్తే, మరొక శాఖ ఇళ్లను కూలగొడుతుందా,పర్మిషన్ ఇచ్చి తర్వాత ఇళ్లు కూలగొడితే దానికి బాధ్యుడు ఎవరు అని అన్నారు.ఒక చిన్న పాప, ఒక గర్భిణీ మహిళ ఇళ్లు కూలగొట్టదని బతిమాలిన కనికరం చూపలేదు ప్రభుత్వం,ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ఎవరు బాధ్యులు,నీ అన్న ఇళ్లు ముట్టనివ్వవు, బడుగుల బతుకులు మాత్రం చిద్రం కావాలా,సీఎం అన్నకు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేంత సమయం ఉంటుంది కానీ, పేదల ఇండ్లు మాత్రం సమయం ఇవ్వకుండా బుల్డోజర్లతో తొక్కిస్తారా ఇదేమి న్యాయం అని ప్రశ్నించారు.హైదరాబాద్ లో ప్రజలు ఓట్లేయలేదని, వాళ్లపై పగ తీర్చుకుంటమంటే ఊరుకోబోమని,హైదరాబాద్ లో మా ప్రభుత్వం కట్టిన 40 వేల డబుల్ బెడ్ రూమ్ లు వాళ్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.బాధితులకు ముందు మేము కట్టిన ఇళ్లను ఇచ్చి,తర్వాత వాళ్లను కదిలించు లని,నీ భాషలో చెప్పాలంటే చేతనైతే పర్మిషన్ ఇచ్చిన వాళ్లమీద చర్యలు తీసుకోవాలని అన్నారు.పేదవాళ్లు మాత్రమే బతుకు దెరువుకోసం హైదరాబాదు వచ్చి నాలాల్లా మీద ఇళ్లు కట్టుకుంటున్నారు,మూసీ నది మీద పెద్ద పెద్ద బిల్డర్లు బడా బిల్డింగ్ లు కడుతున్నారు వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని అన్నారు. మంత్రుల ఫామ్ హౌస్ లను ముందు కూల్చి వేసిన తర్వాత, పేదల ఇండ్లను సమయం ఇచ్చి కూల్చాలని అన్నారు. పేదల ఇండ్లను కూల్చి వారిని చావకొట్టి ఏం సాధిస్తావు సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని అన్నారు.హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ పార్టీ లీగల్ టీమ్ అండగా ఉంటది అని అన్నారు.ముఖ్యమంత్రి మతి లేని నిర్ణయాల కారణంగా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అని,సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ బతుకమ్మ చీరల ఆర్డర్ ను సిరిసిల్లకు ఇచ్చారు అని అన్నారు.

రంజాన్ తోఫా, క్రిస్ మస్ కానుక, యూనిఫామ్ ల ఆర్డర్లు కూడా ఇచ్చి ఇక్కడి నేతన్నలకు ఆదాయం డబుల్ అయ్యేలా కేసీఆర్ చేశారు అని,గతంలో కే సి ఆర్ కరీంనగర్ ఎంపీగా ఉండి,వారికీ ఇచ్చిన మాట ప్రకారం సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల నివారణకు కృషి చేశారు అని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చిందని, బతుకమ్మ చీరల ఆర్డర్ల కారణంగా సిరిసిల్లలో ఆత్మహత్యలు ఆగిపోయాయి,సంక్షోభం ముగిసింది,ఇప్పుడిప్పుడే నేతన్నలు కాస్త ఆర్థికంగా నిలదొక్కుంటున్నారు అని అన్నారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం అయ్యిందన్నారు, అసెంబ్లీ వేదికగా విచారణ చేసుకోవాలని సవాల్ విసిరారు. ఈ ముఖ్యమంత్రి పిచ్చోడు అని.. పిచ్చి నిర్ణయాల కారణంగా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అని అన్నారు.

రంజాన్ తోఫా, క్రిస్ మస్ కానుక బంద్ చేశారు, ఎందుకు బంద్ చేశారో తెలియదు,మంచి పథకాలను బంద్ చేయాల్సిన అవసరమేమిటీ అని ప్రశ్నించారు. ఇప్పటికే 22 మంది నేతన్నలు చనిపోయారని లిస్ట్ ఇచ్చినా,ఆటో డ్రైవర్లు, రైతులు చనిపోతున్నారని చనిపోయిన వారి పేర్లతో లిస్ట్ ఇచ్చినా, ఇప్పటికీ దాని మీద స్పందన లేదు అని అన్నారు.సిరిసిల్ల లో మీరు 365 రోజులు పని కల్పిస్తామని పెద్ద పెద్ద మాటలు చెప్పిర్రు,మరి పదినెలలుగా పని లేకుండా చేశారు అని,మేము 3, 312 కోట్ల ఆర్డర్లు ఇస్తే మీరు అంతకు డబుల్ ఇవ్వాలి కదా, మరి ఎందుకు ఇవ్వలేదు అని అన్నారు.తెలిసి తెలియకుండా కాంగ్రెస్ సన్నాసులు మాట్లాడే మాటలకు నేతన్నలు ఆగం కావద్దు,మా ప్రభుత్వం పోతదని మేము అనుకోలే, 3, 312 కోట్లలో 250 కోట్లు మాత్రమే మేము పెండింగ్ పెట్టినామని అన్నారు.

ఉన్నోళ్లకు కాకుండా పేదోళ్లకు ఒక చీర కాదు, రెండు చీరలు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పినాడని,ఆ రెండు చీరల ఆర్డర్లు ఇక్కడి సిరిసిల్ల నేతన్నలకుఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అధికార మదంతో కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారు,ఇక్కడి అధికారులు కూడా కాంగ్రెస్ కార్యకర్తల్లాగ్గా వ్యవహరిస్తున్నారు అని,ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో మా ఫోటోలు ఉండడం లేదు అని,నా మీద నాలుగు సార్లు ఓడిపోయిన వ్యక్తి ఇక్కడ ఏదో అధికారం చెలాయించాలని చూస్తున్నాడు అని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ను పుట్టించిందే కేసీఆర్,ఒళ్లు దగ్గర పెట్టుకోని అధికారులు పనిచేయాలి అని అన్నారు.కాంగ్రెస్ నాయకులే పోస్టులు, మార్కెట్ కమిటీ పదవులు అమ్ముకున్నారని ఆరోపణలు చేస్తున్నారు అని అన్నారు.54 పోస్టులకు సంబంధించి మెరిట్ లిస్ట్ ను బయట పెట్టాలి అని,రాత పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, కాంగ్రెస్ కార్యకర్తలకు పోస్ట్ లు వచ్చేలా అక్రమాలు చేశారని అన్నారు.

కలెక్టర్, ఆర్డీఓ లు ఒళ్లు దగ్గర పెట్టుకొని పనిచేయాలని,ఏపీ లో ముగ్గురు ఐపీఎస్ అధికారులు ఎక్స్ ట్రా లు చేస్తే వాళ్ల పరిస్థితి ఏమైంది తెలుసుకోవాలి అని అన్నారు. మళ్లీ తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కేసీఆరే అని,అప్పుడు అందరి లెక్కలు తేలుస్తామని,ఈ రోజు అతిగా చేస్తున్న వారికి,అధికారంలోకి వచ్చాక మిత్తితో సహా చెల్లిస్తామని, రేవంత్ రెడ్డి నా మీద ఏమైనా పగ తీర్చుకోవాలంటే నేను సిద్ధంగా ఉన్నానని అన్నారు.

కాంగ్రెస్ వాళ్లు ఎన్నో డైలాగులు చెప్పి అధికారంలోకి వచ్చారు,ఇప్పటికీ రైతు భరోసా లేదు, ఏదీ రుణమాఫీ, రైతులు సెల్ఫీ లతో నిరసన తెలుపుతున్నారు అని,నాలుగు రోజులైతే కాంగ్రెసోళ్లు ఊర్లల్లో తిరిగే పరిస్థితి ఉండదు అని అన్నారు.ఈ మూర?పు ప్రభుత్వం చేసే తప్పులకు మూల్యం అనుభవించక తప్పదు అని,ఈ సీఎం మాట్లాడితే ఇన్నవేటివ్ థింకింగ్ అని అంటాడు అని అన్నారు.ఇవ్వని ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవటమే ఇన్నోవేటివ్ థింకింగ్,అర్హత లేని బావమరదికి కాంట్రాక్టులు వచ్చేలా చేయటమే ఇన్నోవేటివ్ థింకింగ్,మేము కట్టిన డబుల్ బెడ్ రూమ్ లు ఇళ్లను రేవంత్ రెడ్డి ఖాతాలో వేసుకోవటమే ఇన్నోవేటివ్ థింకింగ్ అని అన్నారు.

లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ యువతకు ఆ విషయం చెప్పుకోవటంలో మనం విఫలమయ్యామని,ఉద్యోగులకు అత్యధికంగా జీతాలు ఇచ్చినప్పటికీ చెప్పుకోలేకపోయామని, ప్రజలకు ఇప్పుడిప్పుడే అన్ని విషయాలు అర్థమవుతున్నాయని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలని చెప్పిన రాహుల్ గాంధీ ఎక్కడ పోయాడు,రెండు లక్షల ఉద్యోగాలు ఏమో గానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయఅని అన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి



- ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

వీరనారి చాకలి ఐలమ్మ 129 వ జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేపట్టగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని ,తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని చూపిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురుకి మూడేండ్ల జైలు శిక్ష

- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

వ్యక్తి పై హత్యయత్నంకు కారణమైన ముగ్గురు రౌడి షీటర్లకు ఒక్కక్కరికి 3 సంవత్సరాల జైలు శిక్ష, 1000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహజన్ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు.

చందుర్తి మండలం ఆశీరెడ్డి పల్లి గ్రామానికి చెందిన అంచ రాంరెడ్డి కి అదే గ్రామానికి చెందిన వివిధ కేసులలో రౌడి షీటర్స్ గా ఉన్న కట్కూరి స్వామి,గంగుల శ్రీను మరియు చింత శేఖర్ ల కు బావి పంచాయతీ విషయంలో తరచు గొడవలు జరుగగా, ఈ క్రమంలోనే స్వామి, శ్రీను, శేఖర్ లు రాంరెడ్డి ని చంపాలనే ఉద్దేశంతో వారి వెంట తీసుకోని వచ్చిన కర్రతో దాడి చేసినారు అని తెలిపారు. రాంరెడ్డి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు అప్పటి చందుర్తి ఎస్ఐ నీలం రవి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు అని అన్నారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ లు తిరుపతి,లతీఫ్ ,సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య , కానిస్టేబుల్ మధులు 11 మంది సాక్ష్యులను ప్రవేశ పెట్టగా ప్రసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రసిక్యూటర్ వేముల లక్ష్మి ప్రసాద్ వాదించినట్టు తెలిపారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో ముగ్గరికి ఒక్కక్కరికి 3సంవత్సరాల జైలు శిక్ష 1000/- రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు.నిందితులకి శిక్ష పడటం లో కృషి చేసిన పి పి వేముల లక్ష్మి ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ తిరుపతి, లతీఫ్ ,సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య , కానిస్టేబుల్ మధు లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## నెరళ్ల సింగిల్ విండో మహాజన సభ కార్యక్రమం



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని నేరెళ్ల సింగిల్ విండో మహాజనసభ నిర్వహించి ఈ సందర్భంగా చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ త్వరలో రైతులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.రైతులకు రుణాలు మరియు ఎరువులు సకాలంలో అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులందరూ సంఘ సేవలను వినియోగించుకోవాలని కోరారు.అనంతరం నూతన ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ని సన్మానించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ భాస్కర్ గౌడ్,వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు రవీందర్రావు, రాజయ్య,రాజిరెడ్డి, అనిల్ రెడ్డి, గణేష్ గౌడ్, బాలరాజువ్వ మంద నారాయణ మరియు ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సిఈఓ అజయ్,ఆంజనేయులు, రాజయ్య,వెంకటేష్ సిబ్బంది సొసైటీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల విముక్తికి పోరాడిన ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళ పల్లి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ నాడు భూమికోసం,భుక్తి కోసం, పేద ప్రజల కోసం పోరాటం చేసిందని దొరలపై తిరుగుబాటు చేసిన వీర వనిత అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శంగా తీసుకొని తన ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, వైస్ చైర్మన్ నేరళ్ళ నర్సింగం గౌడ్, పెద్దురి తిరుపతి,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ..




- చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం పాటుపడదాం...
- ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని,ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడదాం అని ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో రజక సంఘంఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ హాజరై పూలమాల వేసి నివాళు లుఅర్పించినారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ భూస్వాములకు పెత్తందార వ్యవస్థకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేసిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు.భూమి కోసం భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ గొప్ప పోరాటం చేసిందని అన్నారు.తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి మహిళ లోకానికి స్ఫూర్తి ఇచ్చిన దీరవనిత ఐలమ్మ,ఈ తరంవారు ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాలి అని అన్నారు.పోరాట యోధులను, ఉద్యమ కారులను ప్రజా ప్రభుత్వం గుర్తిస్తుంది అని,సి ఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతిలో చాకలి ఐలమ్మ నాటక ప్రదర్శన పాల్గొని,అదే రోజున కోఠిలోని ఉమెన్స్ కాలేజీ కి చాకలి ఐలమ్మ పేరు పెట్టి,చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రపంచానికి చాటి చెప్పారు అని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు దక్కిన గౌరవం అని,గత ప్రభుత్వ హయాంలో ఉద్యమ కారులను, అమరుల కుటుంబాలను పట్టించుకోలేదు అని అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోతున్నామని,ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు.రాహుల్ గాంధీ పాదయాత్ర సమయంలో దేశవ్యాప్తంగా జనాభా, కులగనన జరగాల్సిందేనని అన్నారు అని,దానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాలలో బీసీ కులగలన బిల్లును ప్రవేశపెట్టామని అన్నారు.అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా ప్రభుత్వంలో ముందుకు పోతున్నామని,మూడు రోజుల క్రితం వేములవాడ పట్టణంలో రజక సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించామని,చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని తీసుకొని ముందుకు పోదాం అని అన్నారు.

# రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి



- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆరు నెలల్లో వీలైనంత ఆయ కట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలని సూచించారు. రాబోయే రెండేండ్లలో పూర్తయ్యే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ శాఖకు దిశా నిర్దేశం చేశారు.

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై జలసౌధలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, తుమ్మల నాగేశ్వర రావు గారు, పొన్నం ప్రభాకర్ గారు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు.ఇప్పటికే 75 శాతం, అంతకు మించి పనులు చేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తే వచ్చే ఖరీఫ్‌లోగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశముంది.

అటు గోదావరి బేసిన్, ఇటు కృష్ణా బేసిన్‌లో ప్రాధాన్యంగా ఎంచుకున్న ప్రాజెక్టులకు నిధులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు. తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టుకు నీటిని అందించే ప్రాజెక్టులకు గ్రీన్ చానల్ ద్వారా బిల్లుల చెల్లింపులు జరగాలి. కొనసాగుతున్న ప్రాజెక్టుల కోసం ముందుగా భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి. అందుకు రెవిన్యూ విభాగంతో సమన్వయం చేసుకోవాలి. భూసేకరణలో మానవీయత ఉండాలి. భూములు ఇచ్చే వారితో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సంప్రదింపులు జరపాలి.

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పరిధిలో పేరుకుపోయిన పూడిక తీతపై ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నవిధానాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. ఏ ఏ ప్రాజెక్టులు తొందరగా పూర్తి చేసేందుకు అవకాశాలున్నాయి. వాటికి అవసరమైన నిధుల వివరాలను నీటి పారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇదే సమావేశం నుంచి అన్ని జిల్లాల ఎస్ఈలతో ముఖ్యమంత్రి గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన అవినీతి బయటపెడుతాం..



- కేటీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయి...
- నేతన్న ల పై మొసలి కన్నీరు కరుస్తున్నాడు కేటీఆర్..
- నేతన్నలను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన అవకతవకాలు,అక్రమాలు,అవినీతి మొత్తం బయటపెడుతాం అని ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నల మీద అవినీతి అక్రమాలకు పాల్పడిన కేటీఆర్ ముందుగా సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని అన్నారు.అధికారం కోల్పోయిన ఇంకా అహంకారపూరిత మాటలు కేటీఆర్ మానుకోవడం లేదని,ఇప్పటికే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ముందుగా కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులకు క్షమాపణ చెప్పాలని,బతుకమ్మ చీరల బకాయిలు పెండింగ్లో పెట్టినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేత కార్మికులకు అనేక ఆర్డర్లు ఇప్పటికే ఇచ్చామని రానున్న రోజుల్లో ప్రతి మహిళకు నాణ్యమైన రెండు చీరలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఇప్పటికే నేత కార్మికులకు సంబంధించిన అనేక పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు . రానున్న రోజుల్లో సిరిసిల్లలో జిల్లాలో మీరు చేసిన అవినీతి అక్రమాలను వెలికి తీస్తామని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ లో రానున్న రోజుల్లో మిగిలేది మీ నలుగురు మాత్రమే అన్నారు.బతుకమ్మ చీరలను సూరత్ నుండి తెప్పించి కోట్లు సంపాదించినది ఎవరని ప్రశ్నించారు.ఇకనైనా నేతన్న లపై రాజకీయం మానుకోవాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగోడు కాబట్టే రాష్ట్రంలో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేసి మిమ్మల్ని గద్దె దించాడని అన్నారు. అధికారులు, మేధావుల సూచనలు తీసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటుంన్నారు అని,బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు అని అన్నారు.

కటీఆర్ కు అధికారం పోయిన దురహరం, పొగరు మాటలు బంద్ చేయడం లేదని,బతుకమ్మ చీరల పై ఇంకా రాజకీయం చేస్తూ కలయాపన చేస్తున్నారన్నారు అని అన్నారు. గత ఎన్నికల్లో గెలవడానికి నేతన్నాలకు బకాయిలు పెట్టి, వారి జుట్టు చేతుల్లో పెట్టుకోవాలని చూసావు అని,బతుకమ్మ చీరలకు 197 కోట్లు బకాయిలు పెట్టింది నీవు కదా అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ హన్ద్లూమ్స్ టెక్నాలజీ నందు 60 సీట్లకు గాను 12 మంది విద్యార్థులు రాజన్న సిరిసిల్ల నుండి అడ్మిషన్ తీసుకోవడం జరిగినది అని అన్నారు.రాష్ట్రంలోని చేనేత కార్మికులకు నేతన్నకు చేయూత (త్రిఫ్ట్ ఫండ్) రూ. 90.00 కోట్లు విడుదల చేశామని,ఇప్పటికే స్కూల్ యూనిఫామ్, పోలీసు యూనిఫామ్ సంబంధించిన బట్టి ఆడర్లు ఇస్తున్నామని అన్నారు.

సిరిసిల్ల లో కాటన్, పాలిస్టర్ ఉత్పత్తులు ఏమయ్యాయని,సిరిసిల్ల కి మార్కెట్ ని దూరం చేసింది నీవు కదా,రాష్ట్రాన్ని 7 లక్షల కోట్లు అప్పులు చేసిన మేము ప్రజా పాలన చేస్తున్నామని అన్నారు.కేటీఆర్ ఇకనైనా నీ బుద్ధి మార్చుకో మీ ప్రభుత్వం ను ప్రజలే పక్కన బెట్టారు,లోక సభ ఎన్నికల్లో ఏమైంది,ఒక్క సీటు గెలువలేదు అని అన్నారు.మళ్ళీ ఉపఎన్నికలు అంటున్నావు,వస్తె మీ బిఆర్ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని, మొన్నటి కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది అని అన్నారు.సిఎం రేవంత్ రెడ్డి మహిళల సంఘాలకు 1 కోటి 30 లక్షలు చీరాల అర్డర్స్ ఇస్తామని సిఎం చెప్పారు అని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ స్కీమ్ లు అన్నీ స్కాం లే అని,హైడ్రా తో ప్రజల సంపాదన కాపాడే ప్రయత్నం చేస్తున్నామని,కబ్జా లకు గురి ఆయిన నాళాలు, చెరువులు కాపాడుతున్నమని అన్నారు.సిరిసిల్ల జిల్లాల్లో జరిగిన అవకతవకల పై, అన్ని త్వరలోనే బయటకు తీస్తామని,నీవు వాటికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది అని అన్నారు.మేము కక్ష్య సాధింపు అనుకుంటే మీ హాయంలో అన్న అధికారులే ఇంకా పనిచేస్తున్నారని కేటీఆర్ ఇప్పటికైనా అహంకారం తగ్గించుకోవాలని అన్నారు.


# కేటీఆర్‌కు సుజన్ రెడ్డి లీగల్ నోటీసు

బలగం టీవి, హైదరాబాద్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు సుజన్ రెడ్డి లీగల్ నోటీసులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం శోధ కంపెనీకి ఇచ్చిన అమృత్ పథకం టెండర్లలో అవినీతి జరిగిందని చేసిన ఆరోపణలపై ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కాగా కొద్దిరోజుల క్రితం.. తెలంగాణ ప్రభుత్వం అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ వెంటనే విచారణ చేపట్టి.. నిజాలను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, టోచన్ సాహూలకు గత శుక్రవారం లేఖలు రాశారు. కేంద్రం అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.1500 కోట్ల టెండర్లు సీఎం సొంత బావమరిది సుజన్ రెడ్డికి చెందిన శోధ కంపెనీ కి అర్హతలు లేకున్నా కట్టబెట్టారని.. వెంటనే ఈ ఆరోపణలపై కేంద్రం విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. కాగా ఈ ఆరోపణలపై సుజన్ రెడ్డి కేటీఆర్‌కు లీగల్ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియా, వెబ్ సైట్ నుండి కంటెంట్ తొలిగించాలని సుజన్ రెడ్డి కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు.

# ఇది మీకు ఉద్యోగం కాదు. ఒక భావోద్వేగం



- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

“ఇది మీకు ఉద్యోగం కాదు. ఒక భావోద్వేగంతెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో ముడిపడి ఉంది. నీళ్ల నియామకాల ఆకాంక్షల కోసమే తెలంగాణ ఏర్పడింది. నీళ్ల మన సంస్కృతిలో భాగం. అలాంటి శాఖకు ప్రతినిధులుగా నియమితులవుతున్నారు. ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకు అందించాల్సిన బాధ్యత మీపై ఉంది” అని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

టీఎస్‌పీఎస్సీ ద్వారా ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నీటి పారుదల శాఖ కార్యాలయం జల సౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, తుమ్మల నాగేశ్వరరావు గారు, పొన్నం ప్రభాకర్ గారు, సలహాదారు షబ్బీర్ అలీ గారి సమక్షంలో ముఖ్యమంత్రి గారు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు.

“రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణాలేంటో గమనించాలి. హైదరాబాద్ జంట నగరాలకు మంచినీటి సౌకర్యాన్ని అందిస్తున్న ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించిన ప్రముఖ ఇంజనీరు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారిని ఆదర్శంగా తీసుకోండి.గడిచిన పదేళ్లలో రెండు లక్షల కోట్లు ఖర్చు చేసినా తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తి కాలేదు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కారాదు.ఏ వృత్తిలోనైనా క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్నవారే రాణిస్తారు. ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ఇంజనీర్లుగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి.తెలంగాణ పునర్నిర్మాణంలో నీళ్ల అత్యంత కీలకం. దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలపాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి.” అని అన్నారు. కార్యక్రమ ముగింపులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జలసౌధకు వచ్చిన మొట్టమొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నని చెప్పారు.



# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి...

బలగం టీవీ , సిరిసిల్ల

చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యలయంలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి అదనపు ఎస్పీ చంద్రయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. బానిసత్వాన్ని బద్దలు కొట్టి సమాజానికి చైతన్యాన్ని అందించిన వీరనారి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు మధుకర్, రమేష్ ,కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నో ఆర్‌టీఎం కార్డ్.. ఐదుగురికి రిటెన్షన్..!




**బలగం టీవీ, బెంగళూరు**

ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ పాలసీని బీసీసీఐ ఖరారు చేసినట్లు సమాచారం. బెంగళూరు వేదికగా జరిగిన బీసీసీఐ 93వ సాధారణ సర్వసభ్య సమావేశం(ఏజీఎం) జరిగింది. ఈ మేరకు అతి త్వరలోనే బీసీసీఐ ఐపీఎల్ 2025 రిటెన్షన్ పాలసీని అధికారికంగా ప్రకటించనుంది.

ఓ జాతీయ వెబ్‌సైట్ కథనం ప్రకారం.. కొత్త రిటెన్షన్ పాలసీలో ఐదుగురి ఆటగాళ్లను రిటెన్ చేసుకోవచ్చు. గత మెగా వేలంలో లాగానే ఆర్‌టీమ్ కార్డ్స్‌కు అవకాశం లేదు. రిటెన్షన్ పాలసీని రూపొందించే ముందు బీసీసీఐ 10 ఫ్రాంచైజీల ఓనర్లతో సమావేశమై వారి సూచనలు, సలహాలు తీసుకున్నది. అలాగే ఈ సమావేశంలో ఆయా ఫ్రాంచైజీలు భిన్నమైన వాదనలు వినిపించినట్లు వార్తలు వచ్చాయి. కొందరు మెగా వేలం అవసరం లేదంటే.. మరికొందరు కావాలని, 8 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం ఇవ్వాలని, ఆర్‌టీమ్ కార్డ్స్ ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ప్రచారం జరిగింది.బీసీసీఐ మాత్రం ఇవేవి పట్టించుకోకుండా ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకునే విధంగా రూల్స్ రూపొందించినట్లు తెలుస్తోంది. రైట్ టు మ్యాచ్ కార్డ్(ఆర్‌టీమ్)తో ఏదైనా జట్టు తమ ఆటగాడిని వేలంలో కొనుగోలు చేస్తే ఆ ధరను చెల్లించి తిరిగి తీసుకోవచ్చు. 2018 ఐపీఎల్ మెగా వేలంలో ఆర్‌టీఎమ్ కార్డ్‌ను చివరిసారిగా ఉపయోగించారు.ఆ తర్వాత బీసీసీఐ ఆర్‌టీమ్ కార్డ్స్‌ను తొలగించింది.

# రిటైర్మెంట్ ప్రకటించిన షకీబ్ అల్ హసన్

**బలగం టీవీ, కాన్పూర్**

బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు గురువారం ప్రకటించాడు. అలాగే తన టెస్టు కెరీర్ ముగింపు దశకు చేరుకుందంటూ వెల్లడించాడు. స్వదేశంలో మీర్పూర్‌లో చివరి టెస్టు ఆడాలన్న కోరికను క్రికెట్ బోర్డుకు చెప్పానని, వాళ్లు అంగీకరిం చారని, బంగ్లాదేశ్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఒకవేళ అలా జరగకుంటే, కాన్పూర్‌లో భారత్‌తో జరిగే టెస్టు తనకు చివరిదని తెలిపారు.



37 ఏళ్ల షకీబ్ 129 టీ20లు ఆడారు. టీ20 వరల్డ్‌కప్ సమయంలోనే చివరి టీ20 మ్యాచ్ ఆడేశానని, సెలెక్టర్లతో ఈ అంశాన్ని చర్చించానని, 2026 వరల్డ్‌కప్‌ను గమనిస్తే, ఇక జట్టు నుంచి తప్పుకోవడం సబబే అని అర్థమవుతోందన్నారు. షకీబ్ మొత్తం 69 టెస్టులు ఆడాడు. వాటిల్లో 4453 పరుగులు చేశాడు. 242 వికెట్లు కూడా తీశాడు.

ఇటీవలే బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో దేశం తరఫున టెస్టు మ్యాచ్ ఆడిన అతి పెద్ద వయస్కుడిగా షకీబ్ నిలిచాడు. ప్రస్తుతం జరుగుతున్న టెస్టులో 37 ఏళ్ల 181 రోజుల వయసులో షకీబ్ శనివారం మైదానంలో అడుగుపెట్టాడు.

# ఒలింపియాడ్ విజేతలకు రూ.3.2 కోట్లు



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బుడాపెస్ట్ (హంగేరి) వేదికగా ముగిసిన ప్రతిష్టాత్మక 45వ చెస్ ఒలింపియాడ్ ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు గెలిచిన భారత బృందానికి ఆలిండియా చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) రూ.3.2 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. 97 ఏండ్ల చెస్ ఒలింపియాడ్ చరిత్రలో చారిత్రక విజయం సాధించిన భారత చదరంగ వీరులకు సన్మానం సందర్భంగా ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ నగదు బహుమతి ప్రకటన చేశారు. ఆటగాళ్లకు రూ. 25 లక్షలు, పురుషుల, మహిళల జట్టు కోచ్‌లు అయిన అభిజిత్ కుంటె, శ్రీనాథ్ నారాయణన్‌కు తలా రూ.15 లక్షలు పంచనుండగా భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన దివ్యేందు బరువకు రూ.10 లక్షలు, అసిస్టెంట్ కోచ్‌లలో ఒక్కొక్కరికి రూ. 7.5 లక్షలు అందనున్నాయి.

# భారత మహిళా క్రికెటర్లను కలిసిన రానా



- **వీడియో పోస్ట్ చేసిన బీసీసీఐ**
- **టీ20 ప్రపంచ కప్‌ను పట్టుకొచ్చేయండి : రానా**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

యూఏఈ వేదికగా టీ20 మహిళా ప్రపంచకప్ అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మహిళల టీమ్ ఇండియా జట్టు అక్కడికి చేరుకుంది. అయితే దుబాయ్‌లో మహిళా క్రికెటర్లు దిగిన వేళ అక్కడ వారికి సినీ నటుడు దగ్గుబాటి రానా ఎదురయ్యారు. దాంతో రానా వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. టీ20 ప్రపంచ కప్‌ను పట్టుకురావాలని ఆకాంక్షించాడు. అందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో ప్రత్యేకంగా పోస్టు చేసింది. "ఎయిర్ పోర్ట్‌లో అద్భుతమైన వ్యక్తులను కలిశాను. భారత్ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆల్ ది బెస్ట్" అంటూ రానా చేసిన కామెంట్స్ ఆ వీడియోలో ఉన్నాయి. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది.

# ఆమె షూస్ వేసుకుని వెళ్లాల్సి వచ్చింది : యూవీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ**


భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ గతంలో ఓ హీరోయిన్‌తో డేటింగ్ చేసినట్లు తాజాగా ఓ ఇంటర్వ్యూలో రివీల్ చేశాడు. అయితే ఆ సమయంలో తాను చేసిన ఓ ఫన్నీ మూమెంట్‌ను కూడా గుర్తు చేసుకున్నాడు. ఓసారి తాను ప్రేయసి బూట్లు వేసుకోవాల్సి వచ్చిందని చెప్పాడు.

"గతంలో నేను ఓ హీరోయిన్‌తో డేటింగ్ చేశాను. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సమయంలో తన అడిలైడ్‌లో షూటింగ్ కోసం వచ్చింది. మేము అప్పుడు కాన్‌బెర్రాలో ఉన్నాం. అప్పుడే ఆమెకు నేను ఒక మాట చెప్పాను. ప్లీజ్ నువ్వు ఇక్కడికి రావద్దు. నేను గేమ్‌పై ఫోకస్ పెట్టాలనుకుంటున్నాను. ఇది ఆసీస్‌తో జరగనున్న టెస్టు సిరీస్' అని అన్నాను. కానీ ఆమె మాత్రం మా వెనకనే కాన్‌బెర్రాకు వచ్చేసింది. అప్పటికే నేను తొలి రెండు టెస్టుల్లో పెద్దగా పరుగులేం చేయలేదు. ఆమెను చూశాక 'నువ్వు ఇక్కడేం చేస్తున్నావు?' అని అడిగాను. 'నీతో టైమ్ స్పెండ్ చేద్దామ వచ్చాను' అని చెప్పింది. ఆమెతో ఆ రోజు మొత్తం ఉండిపోయాను. 'ఇక నువ్వు నీ కెరీర్ మీద కాన్సన్‌ట్రేషన్ చేయ్. నేను నా కెరీర్ మీద దీష్టి పెడతా ' అని అన్నాను. ఆసీస్ పర్యటన ఎంత కష్టమో అని తెలిసిందే కదా. ఆ తర్వాత కాన్‌బెర్రా నుంచి అడిలైడ్‌కు వెళ్లేందుకు రెడీ అవుతున్నాను. అయితే ఆమె నా సూట్‌కేస్‌ను ప్యాక్ చేసింది. అయితే ప్రయాణం చేయాల్సిన రోజు ఉదయం నా షూస్ ఎక్కడ అని అడిగాను. అప్పుడు ఆమె వాటిని కూడా ప్యాక్ చేశానని చెప్పింది. మరి నేను బస్సులో ఎలా వెళ్లాలి అని అడిగాను. అప్పుడు ఆమె తన షూస్ వేసుకోమని చెప్పింది. అప్పుడు తనకు పింక్ స్లిప్పర్లు ఉన్నాయనుకుంటా. ఓరి దేవుడా నాకెంత కష్టం వచ్చిపడింది అని అనుకున్నా. వాటిని వేసుకొని నిదానంగా బస్సు దగ్గరకు వచ్చేశాను. నా లగేజీ బ్యాగ్‌ను అడ్డుపెట్టుకుని మరీ కనిపించకుండా చేశాను. అయితే, నా టీమ్ మెంబర్స్ కొందరు నన్ను చూసేశారు. చప్పట్లు కొట్టి మరీ ఆట పట్టించారు. దీంతో వేరేవి తీసుకొనేంతవరకూ ఆ పింక్ స్లిప్పర్లతోనే జర్నీ చేయాల్సి వచ్చింది" అని యువరాజ్ గుర్తు చేసుకున్నాడు. అయితే ఆ హీరోయిన్ ఎవరనే విషయాన్ని యువీ ఆ ఇంటర్వ్యూలో రివీల్ చేయలేదు.

# 'దేవర' నుంచి ఆయుధ పూజ సాంగ్ ప్రోమో

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న చిత్రం దేవర. నందమూరి అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తుండగా.. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. 25న అర్ధరాత్రి నుంచి షోస్ మొదలయ్యాయి. ఇదిలా ఉండగా ఈ సినిమా నుంచి తాజాగా ఆయుధ పూజ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటకు రామ జోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా.. కాలా భైరవ పాడాడు. అనిరుధ్ సంగీతం అందించాడు.



## అలియా భట్ 'జిగ్రా' ట్రైలర్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటి అలియా భట్‌నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రా'. ఈ సినిమాను ధర్మ ప్రోడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అలియా భట్, షాహీన్ భట్, సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మిస్తుండగా.. మౌనిక ఓ మై డార్లింగ్ సినిమా ఫేం వసన్ బాల దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 11న విడుదల కానుంది. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు.ఈ ట్రైలర్ చూస్తుంటే.. బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. రాఖీ కట్టి తన అక్కకు ఏ కష్టం వచ్చిన చూసుకుంటాను అంటారు సోదరులు. కానీ ఇక్కడ తన తమ్ముడికి కష్టం వస్తే.. అతనికి ఎలాంటి హానీ జరగకుండా కాపాడుకుంటానని అలియా భట్ ఒక అక్కగా ప్రమాణం చేస్తుంది. అయితే అసలు తన తమ్ముడికి వచ్చిన కష్టం ఏంటి. అక్కగా అలియా ఏం చేసింది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. 'ఆర్చీస్' చిత్రంలో కీలక పాత్ర పోషించినవేదాంగ్ రైనా అలియా భట్ తమ్ముడిగా నటిస్తుండగా.. టాలీవుడ్ నటుడు రాహుల్ రవీంద్రన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.